('హదీసు'ల ప్రాముఖ్యతను తెలుసుకొనుటకు ముందుమాట, తొలిపలుకు తప్పక చదవండి)

# తొలిపలుకులు

సర్వ స్తోత్రాలూ అల్లాహ్ (త) కొరకే. మన మందరమూ ఆయన్నే స్తుతిస్తున్నాము. సహాయం కొరకు ఆయన్నే అర్థిస్తున్నాము. పాపాల క్షమాపణకు ఆయన్నే వేడుకుంటున్నాము. మన మనోకాంక్షల మరియు పాపాల నుండి అల్లాహ్ (త) శరణు కోరుకుంటున్నాము. అల్లాహ్ (త) మార్గదర్శకత్వం చూపిన వారిని ఎవ్వరూ మార్గభ్రష్టత్వానికి గురిచేయలేరు. అదేవిధంగా అల్లాహ్ (త) మార్గభ్రష్టత్వానికి గురిచేసిన వారికి ఎవ్వరూ మార్గదర్శకత్వం చేయలేరు. అల్లాహ్ (త) తప్ప ఆరాధ్యులెవరూ లేరని నేను సాక్ష్యం ఇస్తున్నాను. ఇంకా ము'హమ్మద్ (స) అల్లాహ్ (త) దాసులు మరియు ఆయన ప్రవక్త అని కూడా సాక్ష్యం ఇస్తున్నాను.

అల్లాహ్ (త) స్తోత్రం తర్వాత ప్రవక్త (స)ను పూర్తిగా అనుసరించనంతవరకు విశ్వాస మాధుర్యాన్ని చవిచూడలేము. ప్రవక్త (స) 'హదీసు'లను పూర్తిగా అనుసరించినంతవరకే విధేయతా వాగ్దానం నెరవేరుతుంది. ప్రవక్త (స) వివరణల ద్వారానే ఖుర్ఆన్‌ను అనుసరించటం జరుగుతుంది. వీటిని గురించి వ్రాయబడిన పుస్తకాల్లో «**మిష్కాతుల్ మ'సాబీ'హ్**» ప్రముఖమైనది. ఇందులో వివిధ 'హదీసు'లను చేర్చడం జరిగింది. దీన్ని సమకూర్చి, ప్రవక్త సాంప్రదాయాలను వ్యాపింపజేస్తూ, బిద్'అత్‌లను రూపుమాపడానికి ప్రయత్నించిన వారు, అబూ ము'హమ్మద్ –'హుసైన్ బిన్ మస్'ఊద్ బిన్ ము'హమ్మద్ అల్ ఫరాఅ' **అల్ బ'గవీ** (రహ్మ). అల్లాహ్ (త) అతని తరగతులను అధికం చేయుగాక. అతడు దీన్ని సమకూర్చినప్పుడు, 'హదీసు'ల పరంపరల ధృవీకరణ, ఉల్లేఖకుల పేర్లను ప్రస్తావించలేదు. ఈ కారణంగా కొందరు 'హదీసు' వేత్తలు దీన్ని విమర్శించారు.

తరువాత ము'హమ్మద్ బిన్ 'అబ్దుల్లాహ్ అల్ ఖ'తీబ్ **అత్ తబ్రే'జీ** (రహ్మ) గారు, **బ'గవీ** గారి **మ'సాబీ'హ్**లో గుర్తులు లేని 'హదీసు'లకు గుర్తింపు పెట్టారు. అంటే 'హదీసు'వేత్తల, వారి పుస్తకాల పేర్లను పేర్కొన్నారు. 'హదీసు' ప్రారంభంలో **'హదీసు'లను ఉల్లేఖించిన** ప్రవక్త (స) అనుచరుని పేరును, చివరలో 'హదీసు'ను వ్రాసి పెట్టిన **'హదీసు'వేత్తల** పేర్లను, వారి పుస్తకాల పేర్లను కూడా పేర్కొనడం జరిగింది. **బ'గవీ** గారు సమకూర్చిన ఈ «**అల్ మ'సాబీ'హ్**» కు, '**తబ్రే'జీ** గారు «**మిష్కాతుల్ మసాబీహ్**» అని పేరు పెట్టారు.

ఏవిధంగా **బ'గవీ** గారు తమ గ్రంథాన్ని 30 **పుస్తకాలలో** సమకూర్చారో **తబ్రే'జీ** గారు కూడా అలాగే చేసారు. **బ'గవీ** గారు ప్రతి **అధ్యాయాన్ని 2 విభాగాలలో** విభజించారు. **మొదటి** విభాగంలో బు'ఖారీ, ముస్లిమ్‌లు పేర్కొన్న 'హదీసు'లను లేదా వారిద్దరిలో ఒక్కరు పేర్కొన్న 'హదీసు'లను పెట్టారు. **రెండవ** విభాగంలో వీరిద్దరితో పాటు ఇతరులు కూడా ఉల్లేఖించిన 'హదీసు'లను పేర్కొన్నారు. **తబ్రే'జీ** గారు **మూడవ** విభాగం అధికం చేసి ప్రవక్త (స) అనుచరులు, తాబయీన్లు పేర్కొన్న 'హదీసు'లను కూడా చేర్చారు.

ఈ గ్రంథంలో: 1. అబూ 'అబ్దుల్లాహ్ - ము'హమ్మద్ బిన్ ఇస్మా'యీల్ బిన్ ఇబ్రాహీం అల్ **బు'ఖారీ**, 2. అబుల్ 'హసన్ – అసాకిరుద్దీన్ **ముస్లిమ్** బిన్ 'హజ్జాజ్ బిన్ ముస్లిమ్ బిన్ వ'ర్ద్' అల్ ఖుషైరీ అన్ నషాపూరి,

3. అబూ 'అబ్దుల్లాహ్ - **మాలిక్** బిన్ అనస్ బిన్ మాలిక్ బిన్ అబూ ఆమిర్ అల్ అస్బాహీ, 4. అబూ 'అబ్దుల్లాహ్ - ము'హమ్మద్ బిన్ ఇద్రీస్ బిన్ అబ్బాస్ అష్-**షాఫయీ అల్ ఖురషీ**, 5. అబూ 'అబ్దుల్లాహ్ - అహ్మద్ బిన్ ముహమ్మద్ బిన్ '**హంబల్** అష్షైబానీ, 6. అబూ 'ఈసా - ము'హమ్మద్ బిన్ 'ఈసా బిన్ సూరా **తిర్మిజీ**' అస్ సులమి అల్ ఖురషీ, 7. **అబూ దావూద్** - సులైమాన్ బిన్ అల్ అష్అస్ అల్ అ'జ్ది అస్సిజిస్తానీ, 8. అబూ 'అబ్దుర్ర'హ్మాన్ - 'అహ్మద్ బిన్ షుఐబ్ బిన్ అలి బిన్ సిన్నాన్ అన్ **నసాయీ**, 9. అబూ 'అబ్దుల్లాహ్ - ము'హమ్మద్ బిన్ య'జీద్ **ఇబ్నె మాజహ్ అర్ రబ'యీ** అల్ ఖ'జ్వీనీ, 10. అబూ ము'హమ్మద్ - 'అబ్దుల్లాహ్ బిన్ 'అబ్దుర్ర'హ్మాన్ బిన్ ఫ'ద్ల్ బిన్ బహ్రామ్ **దార్మీ**, 11. అబుల్ 'హసన్ - 'అలీ బిన్ 'ఉమర్ బిన్ అహ్మద్ **దార ఖుతునీ**, 12. అబూ బకర్ - అ'హ్మద్ బిన్ 'హుసైన్ బిన్ అలి బిన్ మూసా అల్ **బైహఖీ**, 13. అబుల్ 'హసన్ - **ర'జీన్** బిన్ ము'ఆవియహ్ అల్ అబ్దరీ, మొదలైన వారు సమకూర్చిన 'హదీసు'లు ఉన్నాయి.

ప్రస్తుత కాలంలో అవిశ్వాసం, దైవ ధిక్కారం, నాస్తికత్వం, మార్గ భ్రష్టత్వం రోజురోజుకూ వ్యాపిస్తూ వృద్ధి చెందుతూ ఉన్నాయి. పరాయి వారే కాదు, ముస్లిములు కూడా వీటికి గురై తమ్ముతాము నాశనం చేసుకుంటున్నారు. ఖుర్ఆన్‌ను తమ కల్పిత మూఢనమ్మకాలకు అనుగుణంగా మలచుకుంటున్నారు. అంతేకాదు ప్రవక్త (స) 'హదీసు'ల పట్ల కూడా ఇలాగే ప్రవర్తిస్తున్నారు. వాటి ప్రామాణికతను, ప్రాముఖ్యతను నాశనం చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవేళ వీరు ఈ 'హదీసు'ల ప్రాధాన్యత, ప్రాముఖ్యతలను తెలుసుకుంటే వీరు ఏనాడూ ఇటువంటి మహా పాపాలకు పాల్పడరు.

సత్య విశ్వాసులు, ప్రవక్త (స) 'హదీసు'లను ఎంతమాత్రం వదలడానికి సిద్ధం కారు. ఎందుకంటే 'హదీసు'లు దివ్య గ్రంథమైన ఖుర్ఆన్ యొక్క సంపూర్ణ వివరణ. ఈ 'హదీసు'ల్లోనే ఏకత్వం, దైవ దౌత్యం, స్వర్గం, నరకం, దైవ దూతలు, జిన్నులు, పర లోకం, ప్రళయం, దైవ ప్రవక్తలు, దైవభక్తులు, పుణ్యాత్ములు, మంచిచెడులు, వివాహం, జీవితంలోని వివిధ రంగాలకు చెందిన కార్యకలాపాల గురించి, బంధువుల హక్కుల గురించి వివరించడం జరిగింది. 'హదీసు'లను వదలివేయడం ఇస్లామ్ ధర్మాన్ని వదలివేయడంతో సమానంగా భావించాలి.

**'హదీసు' నిర్వచనం :** 'హదీసు' అంటే సంభాషణ. **'హదీసు'వేత్తల** భాషలో : ప్రవక్త (స) వాక్కు, కర్మ, ఉపదేశాలు మరియు ప్రవక్త (స) - తమ సమక్షంలో - సహచరుల ఆచరణలను వారించని విషయాలను 'హదీసు' అంటారు. ప్రవక్త (స), ఖుర్ఆన్ ప్రకారం ఆచరించేవారు. అందువల్ల 'హదీసు'లు ఖుర్ఆన్ వివరణ మరియు వ్యాఖ్యానం అవుతాయి. ప్రవక్త (స) 'హదీసు'లను చదివి, వాటి ప్రకారం ఆచరించటం వల్ల ఉభయ లోకాల్లోనూ ముక్తి, సాఫల్యాలు లభిస్తాయి. ఇవి ప్రవక్త సాంప్రదాయాన్ని ప్రధాన అంశంగా చర్చిస్తాయి.

'హదీసు'ల ప్రాముఖ్యత ఖుర్ఆనులో ఎన్నో చోట్లలో చర్చించబడింది. వాటిలో కొన్నింటిని ఇక్కడ పేర్కొంటున్నాము**:**

అల్లాహ్ **ఆదేశం: 1.** " ఓ విశ్వాసులారా ! మీరు అల్లాహ్ కు విధేయులై ఉండండి; మరియు ఆయన సందేశహరునికి విధేయులై ఉండండి." (అన్నిసా', **4:59**).

**2.** "మరియు మేము ఏ ప్రవక్తను పంపినా – అల్లాహ్ అనుజ్ఞతో – (ప్రజలు) అతనిని అనుసరించాలనే పంపాము." (అన్నిసా', **4:64**) - ఎందుకంటే ప్రవక్త (స)కు విధేయత చూపితే, అల్లాహ్‌కు విధేయత చూపినట్లే.

**3.** "ఎవడు ప్రవక్తకు విధేయత చూపుతాడో వాస్తవంగా అతడు అల్లాహ్ కు విధేయత చూపినట్లే." (అన్నిసా', **4:80**) - అందువల్ల ఖుర్ఆన్, 'హదీసు'లను అనుసరించటం వల్లనే అల్లాహ్ (త) విధేయత లభిస్తుంది.

**4.** "మేము విన్నాము మరియు విధేయత చూపాము. మరియు ఇలాంటి వారే సాఫల్యం పొందేవారు. అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరునికి విధేయత చూపేవారు మరియు అల్లాహ్‌కు భయపడి, ఆయన యందు భయ భక్తులు కలిగి ఉండే వారు, ఇలాంటి వారే సాఫల్యం పొందేవారు." (అన్నూర్, **24:48-52**)

**5.** "ఓ విశ్వాసులారా ! అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు మీకు జీవితమిచ్చే దాని వైపునకు, మిమ్మల్ని పిలిచినపుడు దానికి సమాధానం ఇవ్వండి." (అల్ అన్ ఫాల్, **8:24**)

**6.** '' (ఓ ము'హమ్మద్ !) నిశ్చయంగా, మేము ఈ గ్రంథాన్ని (ఖుర్ఆన్‌ను), సత్యంతో, నీపై అవతరింపజేశాము – అల్లాహ్ నీకు తెలిపిన ప్రకారం – నీవు ప్రజల మధ్య తీర్పుచేయటానికి," (అన్నిసా', **4:105**) - 'అంటే అల్లాహ్ (త) ప్రవక్త(స)ను ఆదేశించినట్టు. దాని ద్వారా ప్రవక్త (స) ప్రజల్లో తీర్పుచేయాలని,' అంటే అవి ప్రవక్త (స) ఆదేశాలు, ఆచరణలు అవుతాయి. అవే 'హదీసు'లు.

**7.** "వమా అతాకుముర్రసూలు ఫ'ఖుజూ'హు వమా న'హాకుమ్ అన్హు ఫన్తహూ" (అల్ హష్ర్, **59 :7**) - 'సందేశహరుడు మీకు ఇచ్చింది స్వీకరించండి మరియు నిషేధించిన దాని నుండి దూరంగా ఉండండి.'

**ఇస్లామ్**ను అర్థం చేసుకోవడానికి ఖుర్ఆన్ ఎంత అవసరమో, 'హదీసు' కూడా అంతే అవసరం. కనుక ఖుర్ఆన్‌ను అర్థం చేసుకోవటానికి 'హదీసు'లు చాలా అవసరం. దీన్ని గురించిన కొన్ని హదీసులు**:**

ప్రవక్త (స) **ప్రవచనం**: **1.** "నా 'హదీసు'లను విని ప్రజలకు తెలియ పరిచే వారికి అల్లాహ్ (త) సంతోషానందాలు ప్రసాదించు గాక !"

**2.** "ఎవరి చేతిలో నా ప్రాణం ఉందో ఆయన సాక్షి ! నేను తెచ్చిన ధర్మాన్ని అనుసరించనంతవరకు మీలో ఎవరూ ముస్లిమ్ లు కాలేరు."

**3.** ప్రవక్త (స) **ప్రవచనం:** 1. "నేను మీలో రెండు విషయాలను వదలి వెళుతున్నాను. మీరు వాటిని దృఢంగా పట్టు కొని ఉన్నంత వరకు ఎంతమాత్రం మార్గభ్రష్టత్వానికి గురికారు. అవి: **1.** ఖుర్ఆన్, **2.** నా సాంప్రదాయం."(అల్ 'హాకిమ్)

**4.** ప్రతి కల్పితం బిద్'అత్ అవుతుంది. ప్రతి బిద్'అత్ మార్గభ్రష్టత్వానికి గురిచేస్తుంది." (అ'హ్మద్, అబూ దావూద్, తిర్మిజి')

**5.** నా' సాంప్రదాయాన్ని ప్రేమించేవారు నన్ను ప్రేమించినట్లు. నన్ను ప్రేమించేవారు స్వర్గంలో నా సహవాసంలో ఉంటారు. (తిర్మిజి')

**ఒకవేళ** 'హదీసు'ను ఖుర్ఆన్ వివరణగా భావించకుంటే, ప్రతి వ్యక్తి ఖుర్ఆన్ వ్యాఖ్యానాన్ని తన అభిప్రాయాల ద్వారా వివరిస్తాడు. ప్రతి ఒక్కరి అభిప్రాయం సరికాదు. ఒక వాక్యం గురించి ఒకరు ఒక విధంగా భావిస్తారు. మరొకరు మరో విధంగా భావిస్తారు. దీనివల్ల అనేక అభిప్రాయబేధాలు ఏర్పడతాయి. ఖుర్ఆన్ పట్ల ఎవరికి ఎలా తోచితే అలా భావిస్తూ ఆటలా చేసుకుంటారు. వాస్తవం ఏమిటంటే ఖుర్ఆన్ ఒక దిశానిర్దేశాల ప్రామాణిక గ్రంథం. **ప్రవక్త (స) వివరణ లేకుండా** దీన్ని అర్థం చేసుకోవటం ఎంత మాత్రం సాధ్యం కాదు. ప్రవక్త

(స) యొక్క ఆ ఆదేశాలను, వివరణలనే 'హదీసు'లు అంటారు. ప్రవక్త (స) 'హదీసు'లను అనుసరిస్తే, ఖుర్ఆన్‌ను అనుసరించి నట్లే. అదేవిధంగా 'హదీసు'లను తిరస్కరిస్తే ఖుర్ఆన్‌ను తిరస్కరించినట్లే.

« **మిష్కాతుల్ మ'సాబీ'హ్** » ప్రపంచంలో ఎన్నో ఇస్లామీ ధార్మిక పాఠశాలలో ముఖ్య **'హదీసు' అభ్యాస గ్రంథంగా** బోధించబడుతుంది. కాబట్టి దీన్ని ఎన్నో భాషల లోనికి అనువాదాలు చేయబడ్డాయి.

దీని **ఉర్దూ** అనువాదం చాలామంది చేసారు. వారిలో 'అబ్దుస్సలాం **బస్తవీ** (రహ్మ) ఒకరు. వారు దీనికి మంచి అనువాదం మరియు వ్యాఖ్యానం వ్రాశారు. బస్తవీ గారు సందర్భాన్నిబట్టి 'హదీసు'లను **ఉల్లేఖించిన** ప్రముఖ ప్రవక్త సహచరుల జీవిత విశేషాలను మరియు చారిత్రక విషయాలను కూడా వ్యాఖ్యానాలలో వివరించారు.

ఇతర భాషలలో ఎంత నేర్చున్నా, ఒక పుస్తకాన్ని – తమ మాతృభాషలో చదివితే కలిగే సంతృప్తి – ఇతర భాషలలో చదివితే దొరుకదు. కాబట్టి మేము ఈ «**మిష్కాతుల్ మ'సాబీ'హ్**» ను **బస్తవీ** గారి వ్యాఖ్యానంతో సహా సులభమైన తెలుగు భాషలో అందజేయటానికి ప్రయత్నించాము.

**ఈ** అనువాదం చేసేటప్పుడు, రేయింబవళ్ళు, అనుక్షణం, నాకు మానసికంగా మరియు భౌతికంగా సహాయపడిన, నా భార్య, నా కుమారుడు అతని భార్య మరియు నా ముగ్గురు కుమార్తెలు, వారి భర్తలు, ఈ గ్రంథపు అనువాదాన్ని సరిదిద్దటంలో పాల్గొన్న, డాక్టర్ స'యీద్ అ'హ్మద్ 'ఉమ్రీ మదనీ, షే'ఖ్ ము'హమ్మద్ జా'కిర్ 'అబ్దుష్షుకూర్, షే'ఖ్ ఎస్. ఎం. రసూల్, ఈ గ్రంథాన్ని టైపు చేయడంలో సహాయపడిన షేఖ్ ము'హమ్మద్ హుసైన్, డా. అబ్దుర్ రషీద్ మరియు ఈ గ్రంథ ప్రచురణ కొరకు ఆర్థికంగా మరియు ఇతర రూపంలో సహాయపడిన ప్రతి ఒక్కరికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు. అల్లాహ్ (త) మా అందరి శ్రమను అంగీకరించి ఇహపర లోకాలలో అందరికీ అత్యుత్తమ ప్రతిఫలం నొసంగు గాక. ఆమీన్!

ఖుర్ఆన్ ఆయాతులు వచ్చిన చోట, వాటి సూరహ్ పేరు, నం., ఆయతు నం. లు వ్రాసాము.

ఏ విషయానికి గురించయిన 'హదీసు' చూడాలనుకుంటే, ఈ «**మిష్కాతుల్ మసాబిహ్**» చాలు. ఎందుకంటే ఇందులో 13 మంది 'హదీసు'వేత్తలు ప్రోగు పరిచిన, అనేక విషయాలకు సంబంధించిన 'హదీసు'లున్నాయి. వాటికి, ఆ 'హదీసు'వేత్తలదే కాక **అల్బానీ** గారి ధృవీకరణ కూడా'హదీసు' మొదటలో పేర్కొనబడింది.

« **మిష్కాతుల్ మసాబిహ్** » యొక్క **6294** 'హదీసు'లు **రెండు** సంపుటాలలో విభజించబడ్డాయి. మొదటి సంపుటంలో 11 పుస్తకాలు (1012 పేజీలు), రెండవ సంపుటంలో 19 పుస్తకాలు (1019 పేజీలు) ఉన్నాయి.

ఈ గ్రంథంలో తప్పులు, తగ్గింపులు, హెచ్చింపులు ఏమైనా చూస్తే, వాటిని మాకు తెలియజేస్తే ముందు వచ్చే ప్రచురణలలో, వాటిని సరిదిద్దుకుంటాము, ఇన్షా అల్లాహ్! మొదటి ప్రచురణ 1436 హి (2015 క్రీ. శ.)లో అయ్యింది.

అల్లాహుత'ఆలా మాత్రమే సాఫల్యం చేకూర్చేవాడు మరియు సరైన మార్గం చూపేవాడు. ఓ అల్లాహ్ మా శ్రమను అంగీకరించు, నిశ్చయంగా నీవు మాత్రమే సర్వ శ్రవణ సమర్థుడవు, సర్వజ్ఞుడవు, ఆమీన్**!**

మక్కహ్ అల్-ముకర్రమహ్: డాక్టర్ 'అబ్దుల్-ర'హీం బిన్ ము'హమ్మద్ మౌలానా

01/04 /1436 H (21-01-2015 C E)

*****